క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించరూ...

మంత్రి రాజనర్సింహకు వినతి



మంత్రి రాజనర్సింహకు వినతిపత్రం అందజేస్తున్న పుష్పనగేశ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరగారి రమణ తెలిపారు. శుక్రవారం మున్సిపల్ నూతన భవనం ప్రారంభోత్సవానికి హాజరైన సందర్భంగా మంత్రి రాజనర్సింహకు వినతిపత్రం అందజేశారు. అలాగే రామచంద్రాపురం.. శ్రీనివాస్‌నగర్‌కాలనీ మండల ప్రాథమిక పాఠశాల నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ పుష్పనగేశ్ వినతిపత్రం అందజేశారు.

సేవ్ వాటర్, సేవ్ ఎర్త్‌పై అవగాహన

నారాయణఖేడ్: యునైటెడ్‌వే ముంబయి సంస్థ ఆధ్వర్యంలో సేవ్ వాటర్, సేవ్ ఎర్త్ పై ఖేడ్ మండలం ర్యాకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. నీటి పొదుపు, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటే ఆవశ్యకతపై సమగ్రంగా వివరించారు. ర్యాకల్‌తో తోపాటు చాప్టా(కె) ఉన్నత పాఠశాలల ఆవరణల్లో మొక్కలు నాటారు. ఆయా సంస్థల టీంలీడర్ శివరాజ్, అగ్రి ఎక్స్‌పర్ట్ సాయికుమార్, ఫీల్డ్ ఆఫీసర్ ప్రియాంక, శ్రీకాంత్, కార్యక్రమాల ఇన్‌చార్జి అజీజ్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ పొందాలి

నారాయణఖేడ్: విద్యార్థులకు సంబంధించిన బస్సు పాస్‌ల కోసం పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌ను పొందాలని ఆర్టీసీ డీఎం మల్లేశయ్య సూచించారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలలు ప్రస్తుత విద్యా సంవత్సరంలో పునః ప్రారంభమైన నేపథ్యంలో బస్ పాస్‌ల జారీకి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. సందేహాల నివృత్తికి 99592-23170, 73828-00834, 96766-67703 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నీట్ అవకతవకలపై విచారణ జరపాలి

ఎస్ఎఫ్ఐ డిమాండ్



ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

నారాయణఖేడ్: నీట్ ప్రవేశ పరీక్షల్లో అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నల్లవల్లి రమేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్‌ల ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి అంబేడ్కర్ భవన్ వరకు కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మతో ప్రదర్శన నిర్వహించారు. అక్కడికి చేరుకోగానే దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం నల్లవల్లి రమేష్ మాట్లాడుతూ నష్టపోయిన విద్యార్థులకు తక్షణమే న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా సహాయకార్యదర్శి నవీన్, జిల్లా కన్వీనర్ దత్తురెడ్డి, ఆయా సంఘాల నాయకులు చంద్రశేఖర్ తోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్షను మళ్లీ ..

నీట్ ప్రవేశ పరీక్షను మళ్లీ నిర్వహించి బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలని కాంగ్రెస్ గిరిజన విభాగం రాష్ట్ర నాయకుడు ప్రకాష్ రాథోడ్, కాంగ్రెస్ ఖేడ్ నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు నెహ్రూ నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడారు. నీట్ పేపర్, అక్రమాలపై లీకేజీపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలన్నారు. గిరిజన నాయకులు ప్రేమ్‌సింగ్, మోహన్, సురేష్, దేవీదాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బాలో తనిఖీలు

కంగ్టి(నారాయణఖేడ్): మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం ఎంపీడీఓ సత్తయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగు నీరు, మరుగుదొడ్ల సమస్యలున్నట్లు ఆయన దృష్టికి వచ్చింది. మధ్యాహ్నం మెనూ ప్రకారం వంటలు వండరా అని కూడా ఆరా తీశారు. ఆయన వెంట పంచాయతీ సెక్రటరీ సుభాష్ తదితరులున్నారు.



హత్నూర(సంగారెడ్డి): రత్నపురి విద్యాలయంలో యోగా చేస్తున్న విద్యార్థులు



జహీరాబాద్‌లో..



సంగారెడ్డి టౌన్ : ప్రభుత్వ బాలికల పాఠశాలలో..



జిన్నారం(పటాన్‌చెరు)లో...



సదాశివపేట రూరల్(సంగారెడ్డి)లో..



నారాయణఖేడ్‌లో..



జోగిపేట(అందోల్)లో..



రామచంద్రాపురం(పటాన్‌చెరు)లో..



కంది(సంగారెడ్డి)లో..



రాయికోడ్(అందోల్)లో..

ఆరోగ్య యోగం

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందొచ్చని వక్తలు అన్నారు. దాంతో మనిషికి అనేక రకాల ప్రయోజనాలు ఉన్నాయన్నారు. నిత్యం ఉల్లాసంగా ఉత్సాహంగా ఉండొచ్చన్నారు. శుక్రవారం జిల్లావ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయా చోట్ల ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, రాజకీయ పార్టీ నేతలు, సామాజిక సేవకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు చోట్ల మొక్కలు నాటారు.

– న్యూస్, నెట్‌వర్క్

ఊరట

- అందుబాటులోకి వచ్చిన ఎంపీపీ కార్యాలయ నూతన భవనం
- ఊపిరిపీల్చుకుంటున్న అధికారులు, ప్రజలు
- గుమ్మడిదల మండలంలో తొలి నిర్మాణం

గుమ్మడిదల మండలం ఏర్పడిన ఐదేళ్ల తర్వాత ఒక ప్రభుత్వ కార్యాలయ భవనం అందుబాటులోకి వచ్చింది. అరకొర సదుపాయల మధ్య సతమతమయ్యే ఉద్యోగులు, సిబ్బందికి ఊరట కలిగింది. త్వరలో మిగతా ఆఫీస్‌ల భవన నిర్మాణాలకు కూడా మార్గం సుగమం కానుందని ప్రజలు భావిస్తున్నారు.



నూతనంగా ఏర్పాటైన ఎంపీపీ కార్యాలయం ఎదుట అధికారులు, ప్రజాప్రతినిధులు

జిన్నారం(పటాన్‌చెరు): ఐదేళ్ల క్రితం గుమ్మడిదల ప్రత్యేక మండలంగా ఏర్పాటైంది. అప్పటి నుంచి ప్రభుత్వ కార్యాలయాలన్ని అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. 4 ఏళ్లుగా వర్తక సంఘం భవనంలో ఎంపీపీ కార్యాలయం, పాత గ్రామ పంచాయతీ భవనంలో తహసీల్దార్ కార్యాలయం కొనసాగుతుంది. రైతు భవనంలో వ్యవసాయ శాఖ కార్యాలయం, బొంతపల్లిలోని ఓ పరిశ్రమకు చెందిన ప్రైవేటు భవనంలో పోలీస్‌స్టేషన్ నిర్వహిస్తున్నారు. మరిన్ని ప్రభుత్వ కార్యాలయాలు అరకొర వసతులున్న భవనాల్లో ఏర్పాటు చేశారు. ఆయా శాఖల అధికారులు, సిబ్బంది సమస్యల మధ్య సర్దుకుని విధులు నిర్వహిస్తున్నారు. కార్యాలయాలకు వచ్చే ప్రజలు సైతం అసౌకర్యాల నడుమ ఇబ్బందులు పడుతున్నారు. వారి ఇక్కట్లను గమనించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, ఎంపీపీ సద్ది ప్రవీణ, జెడ్పీటీసీ కుమార్‌గౌడ్‌లు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. సీఎస్ఆర్ నిధులు రూ.60లక్షలతో ఎంపీపీ కార్యాలయానికి సొంత భవనాన్ని నిర్మించారు. అందులో భారీ సమావేశ మందిరం, అధికారులకు ప్రత్యేక చాంబర్‌లను ఏర్పాటు చేశారు. మిగతా ప్రభుత్వ కార్యాలయాలకు కూడా సొంత భవనాలను నిర్మించేలా ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మరిన్ని నిర్మాణాలకు శంకుస్థాపన

అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలను నిర్మించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. ప్రభుత్వం నిధులు కేటాయించేలా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. త్వరలోనే మరిన్ని భవన నిర్మాణాలకు శంకుస్థాపనలు చేస్తాం.

– ప్రవీణ, ఎంపీపీ గుమ్మడిదల

అందరి సహకారం తీసుకుంటాం

నూతనంగా ఏర్పాటైన గుమ్మడిదల మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించేలా ముందుకు సాగుతున్నాం. ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు ఉంటేనే అధికారులు ప్రశాంతంగా విధులు నిర్వహిస్తారు. ఎంపీపీ కార్యాలయాన్ని నిర్మించుకోవటం సంతోషదాయకం.

– కుమార్‌గౌడ్, జెడ్పీటీసీ గుమ్మడిదల

జయశంకర్ సేవలు మరువలేనివి



జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి: ప్రొఫెసర్ జయశంకర్ సేవలు మరువలేనివని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కొనియాడారు. తన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా జయశంకర్ చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర అవసరాన్ని ప్రజలకు వివరించి ఉద్యమ స్ఫూర్తిని నింపారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు కాసాల బుచ్చిరెడ్డి, నరహరి రెడ్డి, ఆర్ వెంకటేశ్వర్లు, నర్సింహులు, మనోహర్ గౌడ్, రశీదు, చక్రపాణి, జీవీ శ్రీనివాస్, శ్రావణ్ రెడ్డి, విఠల్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నారాయణఖేడ్: ఆచార్య జయశంకర్ వర్ధంతిని జరిపారు. శుక్రవారం పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ సాధన కోసం జయశంకర్ చేసిన పోరాటాన్ని జెడ్పీటీసీ లక్ష్మీబాయి, విజిలెన్స్ కమిటీ సభ్యులు రవీందర్‌నాయక్‌లు కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తాహెర్, నియోజకవర్గ బీసీ, ఎస్సీ, ఎస్టీ సెల్‌ల అధ్యక్షులు సాయిలుపటేల్, సాయిలు, నెహ్రూనాయక్, మాజీ జెడ్పీటీసీ చందర్‌నాయక్, నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు బీఆర్ఎస్ అండ

కొండాపూర్(సంగారెడ్డి): ఆపదలో ఉన్న ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉంటామని, ఎవరూ అధైర్యపడొద్దని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ధైర్యాన్నిచ్చారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మారేపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బుచ్చయ్య మృతిచెందగా పార్టీ నుంచి మంజూరైన రూ.2 లక్షల బీమా చెక్కును శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో మృతుడి భార్య అనితకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మరణిస్తే అతని కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడకూడదనే ముందు చూపుతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పార్టీ బీమా చేయించారన్నారు. మారేపల్లి పీఏసీఎస్ చైర్మన్ రాజు, పార్టీ కొండాపూర్ మండలాధ్యక్షులు విఠల్, గోవర్ధన్‌రెడ్డి, సీనియర్ నాయకులు మాణిక్ ప్రభు, నర్సింహులు, ప్రభు పాల్గొన్నారు.

సంగారెడ్డి టౌన్: తాగునీటి సమస్యను పూర్తిగా నివారించేందుకు గత ప్రభుత్వం కృషి చేసిందని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. శుక్రవారం సంగారెడ్డి మండలం ఫసల్వాది డబుల్ బెడ్ రూమ్ కాలనీలో రూ. 15 లక్షలతో నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కాలనీల భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని నిర్మించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, జెడ్పీటీసీ సునీత మనోహర్ గౌడ్, కాసాల బుచ్చిరెడ్డి, పట్నం రవితేజ, ఏఈ, ఎంపీడీఓ యాదగిరి, మండల అధికారులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతోనే గుర్తింపు

సీఐ అనిల్‌కుమార్

జోగిపేట(అందోల్): సేవా కార్యక్రమాలతోనే గుర్తింపు లభిస్తుందని జోగిపేట పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో స్నేహ మంజీరా అసోసియేషన్ ఆధ్వర్యంలో 2023–24వ సంవత్సరానికి గాను పదో తరగతిలో మంచి ప్రతిభను కనబరచిన ఉత్తమ విద్యార్థులకు నగదు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. ప్రభుత్వం కూడా కోసం ఎంతో వెచ్చిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవరచుకోవాలన్నారు. మండల విద్యాధికారి కృష్ణ మాట్లాడుతూ చాలా కాలంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో పాఠశాలలో ఎన్నో కార్యక్రమాలను చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ అధ్యక్షుడు నరోత్తం రెడ్డి, మౌలానా, ఎస్ఎంఏ ఉపాధ్యక్షుడు కేశాగౌడ్, కోశాధికారి రామకృష్ణ, సభ్యుడు కొత్త శ్రీనివాస్, ఆర్.కుమార్, నర్సింహులు, బి.శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, కాల్వ ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈవ్‌టీజింగ్‌పై అప్రమత్తంగా ఉండాలి

ఈవ్ టీజింగ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ అరుణ్ కుమార్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఎస్ఆర్ఎం జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైమ్ నివారణపై అవగాహన కల్పించారు. ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ఆయన మాట్లాడారు. బాలికలు మనోధైర్యంతో ఉండాలని, ఈవ్ టీజింగ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎలాంటి ఇబ్బందులు కలిగినా షీటీం దృష్టికి తీసుకురావాలని సూచించారు. సెల్‌ఫోన్‌కు వచ్చే లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ప్రజలు తమ వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ 2 మొగులయ్య, కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి, కరస్పాండెంట్ చంద్రశేఖర్, ఏఎస్ఐ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ అరుణ్ కుమార్

పత్తిలో మెలకువలు పాటించాలి

వట్‌పల్లి(అందోల్): పత్తి సాగులో రైతులు సరైన మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు పొందొచ్చని అందోల్ మండల వ్యవసాధికారి విజయరత్న సూచించారు. శుక్రవారం అక్సాన్‌పల్లిలో సాగవుతున్న పత్తి పంటను పరిశీలించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు, సూచనలిచ్చారు.



సాగుపై అవగాహన కల్పిస్తున్న ఏఓ విజయరత్న

మమత పేరుతో పచ్చబొట్టు..

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

సంగారెడ్డి: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన సంఘటన పట్టణంలో చోటుచేసుకుంది. టౌన్ సీఐ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌సాగర్ చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఇక్కడికి చేరుకొని మృతదేహాన్ని బయటికి తీయించారు. మృతుడి వయసు సుమారుగా 35–40 ఏళ్ల వయసు ఉంటుందని భావిస్తున్నారు. ఎడమ ఛాతి వైపు మమత అనే పేరుతో పచ్చబొట్టు ఉంది. ఎవరికైనా అతని వివరాలు తెలిసి ఉంటే 87126-56718, 87126-61830 నంబర్లలో సంప్రదించాలని ప్రజలకు పోలీసులు విజ్ఞప్తి చేశారు.

తమ్ముడి అదృశ్యంపై ఫిర్యాదు

అమీన్‌పూర్ పీఎస్ పరిధిలో ఘటన

పటాన్‌చెరు టౌన్: తమ్ముడు కనిపించకుండా పోయాడని అన్న ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ... పశ్చిమ బెంగాల్‌కు చెందిన కోటి బతుకుదెరువు కోసం వచ్చి అమీన్‌పూర్ పరిధిలో ఉన్న స్వర్ణ పూర్ణి కాలనీలో స్నేహితులతో కలిసి ఉంటున్నాడు. జనప్రియ అపార్ట్‌మెంట్‌కు సెక్యూరిటీ గార్డుగా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 14న నైట్ డ్యూటీ ఉందని చెప్పి వెళ్లాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఇంటికి చేరలేదు. అతడి ఆచూకీ కోసం తెలిసిన వారిని, బంధువుల వద్ద వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో అతడి అదృశ్యంపై అన్న శంకర్ శుక్రవారం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఏరువాక పౌర్ణమి వేడుకలు



మునిపల్లి(అందోల్)లో..



సదాశివపేట(సంగారెడ్డి)లో..

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో శుక్రవారం ఏరువాక పౌర్ణమిని ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ పనుల ప్రారంభానికి ముందు రైతులు పొలాల్లో పూజలు చేసి పంటలు బాగా పండాలని వేడుకున్నారు. ఆపై పశువులు, ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఎడ్ల బండ్లను ఊరేగించారు. కాగా, పల్లెల్లో పండుగ వాతావరణం కనిపించింది.

సదాశివపేట(సంగారెడ్డి): తెలంగాణ మంజీరా రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మలపల్లి పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని పాతకేరీలో ఏరువాక పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. రైతులు తమ ఎద్దులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. కార్యక్రమంలో మంజీరా రైతు సమాఖ్య నాయకులు సంగొట్టి, రవీందర్, వెంకట్రావు, జలీల్, రాంరెడ్డి, నారాయణరెడ్డి, రాములు, విరన్న, శ్రీశైలం, పాష, అంజన్న, సంగమేశ్ రైతులు పాల్గొన్నారు.

మునిపల్లి(అందోల్): మండలంలోని ఏరువాక పౌర్ణమిని నిర్వహించారు. శుక్రవారం మునిపల్లి, ఖమ్మంపల్లి, తాటిపల్లి, పెద్దలోడి, పిల్లోడి గ్రామాలతో పాటు ఆయా గ్రామాల్లో రైతులు తమ ఎడ్లను సుందరంగా అలకరించారు. ఆపై వాటికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా చోట్ల గ్రామ పుర విధుల గుండా ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్ గోవులకు ప్రత్యేక పూజలు చేశారు.

మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి

హత్నూర(సంగారెడ్డి): మండలకేంద్రంలోని సుందరమ్మ తల్లి జాతర, ఏరువాక పూర్ణమి సందర్భంగా శుక్రవారం బండ్ల ఊరేగింపు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, కాంగ్రెస్ మెదక్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, సువాసినిరెడ్డి తోపాటు పలువురు అమ్మను దర్శించుకుని పూజలు నిర్వహించారు.